## క్లుప్తంగా

### బాధ్యతల స్వీకారం



నందిగామరూరల్: మండల అభివృద్ధితోపాటు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని ఎంపీడీవో ఆర్‌విఎస్‌హెచ్ విఎమ్ ప్రసాదరావు తెలిపారు. ఎంపీడీవోగా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి అభినందనలు తెలియజేశ బురు. డిప్యూటీ ఎంపీడీవో నామేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

### కంప చెట్లు తొలగింపు



గండేపల్లి(కంచికచర్ల):మండలంలోని గండేపల్లి శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన కంపచెట్లను బుధవారం జేసీబీతో తొలగించారు. ఈసందర్భంగా సర్పంచి బొక్కా రవికుమార్ మాట్లాడుతూ శ్మశానవాటిక రోడ్డులోని కంపచెట్ల కారణంగా గాయపడుతున్నట్లు పలువురు ఫిర్యాదు చేయడంతో తొలగించినట్లు వివరించారు. హిందూ శ్మశాన వాటికలోని బోరుకు మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. ఎస్సీ, బీసీ శ్మశాన వాటికల్లోని కంపచెట్లను కూడా తొలగించనున్నట్లు వివరించారు.

### విద్యార్థులకు వైద్యపరీక్షలు



కంచికచర్ల: మండలంలోని పరిటాల అమిత సాయి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన ఆంధ్ర ఆసుపత్రి, దుహితా డెంటల్ హాస్పిటల్ వైద్యులు బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు మొత్తం 500మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులోనూ రాణించగలరన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శశిధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బీ సాయిరామ కృష్ణ , శ్రీనివాసరావు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఇసుక లారీ, జేసీబీ స్వాధీనం



చిల్లకల్లు(జగ్గయ్యపేట):తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ, జేసీబీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ తోట సూర్య శ్రీనివాస్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు..చిల్లకల్లు సమీపంలోని మద్రాస్ సిమెంట్స్ పాత వసతి గృహం వెనుక ఖాళీ ప్రదేశంలో డంప్ చేసిన ఇసుకను జేసీబీ ద్వారా లారీలో లోడ్ చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి లారీ, జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న తొర్రకుంటపాలెం ప్రాంతానికి చెందిన కార్తీక్‌తోపాటు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. విచారణలో తెలంగాణకు ఇసుకను తరలిస్తున్నట్లు అంగీకరించడంతో ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### నలుగురికి వారం రోజులు జైలు శిక్ష

కృష్ణలంక(విజయవాడతూర్పు): మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురికి న్యాయస్థానం వారం రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై మూడో ట్రాఫిక్ పోలీసులు బుధవారం నిర్వహించిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని 7వ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కమ్ రైల్వే కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి ఆర్.వి.ఎస్ శర్మ ఒక్కొక్కరికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించారని చెప్పారు.

### స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విజయవాడ రైల్వే డివిజన్ వ్యాప్తంగా పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు జరిగాయి. విజయవాడలో జరిగిన కార్యక్రమాల్లో డీఆర్ఎం మోహిత్ సోనాకియా పాల్గొని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఉద్యోగులతో స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే ఈ ప్రచార కార్యక్రమాల్లో విజయవాడ డివిజన్ పర్యావరణ అనుకూల కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. స్వచ్ఛత కేవలం ప్రచారం కోసం మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగానే డివిజన్ వ్యాప్తంగా క్లీన్‌నెస్ టార్గెట్ యూనిట్ పేరుతో స్టేషన్ పరిసరాలలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్నట్లు వివరించారు.

# ఆలయానికి వెళ్లే రోడ్లన్నీ అధ్వానం

- అధ్వానంగా శ్రీతిరుపతమ్మ ఆలయానికి వెళ్లే రోడ్లు
- మరమ్మతులకు సైతం నోచుకోని వైనం
- ఇబ్బందుల్లో వాహనచోదకులు
- భక్తులకు తప్పని అవస్థలు



గోతులమయమైన ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ నుంచి పెనుగంచిప్రోలు వెళ్లే రోడ్డు

పెనుగంచిప్రోలు: ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ ఆలయానికి చేరుకునే ప్రధానమైన రెండు రోడ్లు కూడా గోతుల మయం కావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలతో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటుంటారు. ఆది, శుక్రవారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. అయితే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి వెళ్లే ప్రధాన రోడ్లు గోతుల మయం కావడంతో వాహనచోదకులు, భక్తులు అవస్థలుపడుతున్నారు.

**పట్టించుకోని పాలకులు..**

విజయవాడ–హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారిలో ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ నుంచి పెనుగంచిప్రోలు వరకు రోడ్డు సుమారుగా 9కిలో మీటర్లు ఉంటుంది. ఈమార్గం గుండా ఎన్టీఆర్, కృష్ణా, ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాలతో పాటు ఉభయగోదావరి జిల్లాల నుంచి భక్తులు పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి దర్శనానికి వస్తుంటారు. అలాగే తెలంగాణా ప్రాంతం నుంచి హైదరాబాద్, కోదాడ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ తదితర జిల్లాల నుంచి కూడా భక్తులు ఎక్కువగా అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. అయితే ఈ రహదారి మొత్తం పెద్దపెద్ద గుంతలుపడి ప్రాణసంకటంగా మారింది.



మక్కపేట నుంచి పెనుగంచిప్రోలు వెళ్లే రోడ్డులో ఏర్పడిన గోతులు

**మరమ్మతులు అంచనాలకే పరిమితం..**

తెలంగాణ నుంచి మక్కపేట మీదుగా పెనుగంచిప్రోలు చేరుకునే రోడ్డు పొడవు సుమారు ఆరు కిలోమీటర్లు ఉంటుంది. జగ్గయ్యపేట, ఖమ్మం డిపోల నుంచి బస్సులు ఈ రహదారుల గుండా ప్రయాణం సాగిస్తుంటాయి. ఈ రహదారిలో కూడా పెద్దపెద్ద గుంతలు పడటంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని భక్తులు వాపోతున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్నా పెనుగంచిప్రోలు రోడ్ల అభివృద్ధి విషయంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు భక్తుల నుంచి వినిపిస్తున్నాయి. ఆయా రోడ్ల అభివృద్ధి కోసం కొద్దినెలల కిందట రూ.2.25 కోట్లతో రూపొందించిన అంచనాలు కూడా ప్రతిపాదనలకే పరిమితమయ్యాయే తప్ప నిధులు మంజూరుగాకపోవడం గమనార్హం. ఇకనైనా పాలకులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు అయినా చేపట్టాలని భక్తులు, మండల ప్రజలు కోరుతున్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్



పెండ్యాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

పెండ్యాల(కంచికచర్ల):కేంద్ర ప్రభుత్వం మెమో నంబర్ 57 ప్రకారం రాష్ట్రంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు షేక్ నవాబ్‌జానీ డిమాండ్ చేశారు. మండలంలోని పెండ్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్ష్యుడు గడ్డం నారాయణరావు ఆధ్వర్యంలో బుధవారం సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా నవాబ్‌జానీ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని అమలు పర్చిన నోటిఫికేషన్ ఆధారంగా నియమితులైన ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని, 2022లో పెట్టిన సరెండర్ లీవు పాత బకాయిలను ఇవ్వాలని కోరారు. మండలంలోని కీసర, గండేపల్లి, కంచికచర్ల, ఎస్. అమరవరం, గొట్టుముక్కల తదితర గ్రామాల్లో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ కౌన్సిలర్ బీ నరేంద్ర, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్ష్యులు మర్రి ప్రభాకర్, మండలశాఖ అధ్యక్ష్యులు డబ్బూరి సాంబశివరావు, బి.మల్లికార్జునరావు, ఏఎస్ఎన్ మూర్తి, కుక్కల నెహ్రూ, సనక పవన్‌కుమార్, షేక్ మోహిద్దీన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తతతోనే ఆన్‌లైన్ మోసాలకు చెక్



కంచికచర్ల పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న కొనగాల జగన్

కంచికచర్ల: సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని వారి బారిన పడకుండా అందరూ జాగ్రత్తలు పాటించాలని నవజీవన్ బాలభవన్ ఏరియా కోఆర్డినేటర్ కొనగాల జగన్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్య సిబ్బందికి సైబర్ నేరగాళ్ల మోసాలకు బలికావద్దని బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు మీ పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఇతర దేశాల్లో ఉన్న మీ పిల్లలను ఆ దేశ పోలీసులు అరెస్ట్ చేశారంటూ వచ్చే ఫోన్లను నమ్మవద్దని తల్లిదండ్రులను కోరారు. బ్యాంకుల్లో కేవైసీ, బహుమతులు గెలుచుకున్నారని, ఇన్‌కం టాక్స్ కట్టాలంటూ వచ్చే ఫోన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇతరులెవ్వరికీ ఓటీపీలు చెప్పకూడదని సూచించారు. ఒంటరిగా ఉన్న వృద్ధ దంపతుల ఇళ్లల్లో ఎక్కువగా దొంగతనాలు చోటుచేసుకుంటున్నందున, ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి వారి సహాయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.మధురిమ, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



తల్లులకు పోషకాహారం అందిస్తున్న డాక్టర్ నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు



అనుమంచిపల్లిలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



చందాపురంలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ కామేశ్వరి

పెనుగంచిప్రోలు: తల్లీబిడ్డల ఆరోగ్యసంరక్షణలో పౌష్టికాహారం తీసుకోవడం అత్యంత కీలకమైన అంశమని వైద్యాధికారి నాగలక్ష్మి పేర్కొన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో తల్లులు బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ పోషణ ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిరుధాన్యాలతో మంచి ఆరోగ్యంతోపాటు రక్తహీనత తగ్గుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, నాగమణి, విమల, మంజుల, రాజ్యలక్ష్మి, సునీత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**జగ్గయ్యపేట మండలంలో...**

జగ్గయ్యపేట: మండలంలోని అనుమంచిపల్లి, వేదాద్రి గ్రామాల్లో బూచవరం ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి కీర్తిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మహిళల కోసం అక్టోబర్ రెండోతేదీ వరకు వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పేరయ్య, త్రివేణి, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకట్రావు, నాగలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

**పౌష్టికాహార ప్రాధాన్యంపై అవగాహన..**

నందిగామ రూరల్: కిశోరబాలికలు, మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చని వైద్యాధికారి కామేశ్వరి సూచించారు. స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో లింగాలపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చందాపురం గ్రామంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మహిళలు, కిశోర బాలికలకు వైద్యపరీక్షలు చేసి, ఆరోగ్య అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, మాంసాహారం, పాలు, గుడ్లు, చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహారం తీసుకుంటే అనారోగ్య సమస్యలు దరిచేరవని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు బిక్షాలు, నాగేశ్వరరావు, సరోజిని, అంగనవాడీ సూపర్‌వైజర్ వెంకట్రావమ్మ, సీహెచ్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

**నందిగామ పట్టణంలో..**

నందిగామటౌన్:మహిళ ఆరోగ్యంగా బలంగా ఉంటేనే కుటుంబం బలంగా ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో బుధవారం స్వస్థ నారి–సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలు, కిశోర బాలికలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని వివరించారు. ఆస్పత్రి చైర్మన్ నాగేశ్వరరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం



నందిగామరూరల్: విజయదశమి పండుగ సందర్భంగా ఆలయంలో నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల విజయవంతానికి ప్రతిఒక్కరు సహకరించాలని ఈవో సీతారావమ్మ కోరారు. మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులతో బుధవారం ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు, రథోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తుల సహకారంతో ఉత్సవాల విజయవంతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరుతూ సత్యమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులుపాల్గొన్నారు.

## అంతరిక్ష యానం వైపు లయోలా పూర్వ విద్యార్థి



లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతరిక్షంలో జీవితాన్ని గడపడానికి ముందుకు సాగుతున్న ఆంధ్రా లయోలా కళాశాల పూర్వ విద్యార్థిని అనీ సత్తెనపల్లి మనందరికీ గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సదస్సులో అనీ అతిథి ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల యాజమాన్యం సత్కరించింది. భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తుమ్మల శ్రీకుమార్ మాట్లాడుతూ ఖగోళ భౌతిక శాస్త్ర పరిశోధనలో, విదేశాల్లో ఖగోళ జీవశాస్త్రంలో అధ్యయనాల వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఐఐటీ ఇండోర్ నుంచి మాస్టర్స్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అనీ ఆస్ట్రేలియాలోని కర్టిన్ విశ్వ విద్యాలయంతో కలిసి యాజీమార్ట్, ఎండబ్ల్యూఏ వంటి అత్యాధునిక టెలీస్కోప్‌లను ఉపయోగించి పల్సర్‌లపై విస్తృతంగా పనిచేశారన్నారు. ఆమె పరిశోధన ఇప్పుడు యూకేలోని ఎడిన్‌బర్గ్ విశ్వ విద్యాలయంలో ఆస్ట్రోబయాలజీ వైపు ఉత్తేజకరమైన మలుపు తీసుకున్నట్లు తెలిపారు. అక్కడ ఆమె భూమికి ఆవల జీవం ఉండే అవకాశాలను అన్వేషించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఏపీటీ ఏపీ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ జి.సహాయ భాస్కరన్, డాక్టర్ పీవీఎస్ సాయిరాం, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఫాదర్ వైటి ప్రభులు సత్తెనపల్లి అనీ సాధించిన విజయాలను ప్రశంసించారు.

## సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే తాతయ్యకు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

జగ్గయ్యపేటఅర్బన్: భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న పెళ్లి కానుక, కాన్పు, డెత్ క్లెయిమ్‌లను పరిష్కరించకపోవడంతో సుమారు వెయ్యి మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వెంటనే నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నీలకంఠం శివప్రసాద్, కమిటీ సభ్యులు పోతిపాక వెంకటేశ్వర్లు, వేముల శ్రీను, కర్ల జోజి, చిట్యాల మల్లయ్య, వావిళ్ల యాదగిరి, వీర్ల శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్య సంరక్షణకు కృషి



కార్యక్రమ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే తాతయ్య, చైర్మన్ రాఘువేంద్ర తదితరులు



మాట్లాడుతున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి

జగ్గయ్యపేట అర్బన్:మహిళా ఆరోగ్యం, కుటుంబ బలోపేతం ప్రధానలక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన స్వస్థ నారీ–సుశక్త్ పరివార్ అభియాన్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ప్రభుత్వాస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ ఆళ్ల హరీష్‌తో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ ఈ పథకంలో భాగంగా అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రత్యేక శిబిరాల్లో గుండె జబ్బులు, షుగర్, క్యాన్సర్లు, రక్తహీనత నివారణ, పిల్లల సికిల్ సెల్ అనీమియా పరీక్షలు చేయడంతోపాటు టీకాలు, ఆయుష్మాన్ కార్డుల పంపిణీ తదితర కార్యక్రమలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పద్మనాభుని కుటుంబరావు, గుడిసె నాగేశ్వరరావు, కాటగాని నరసింహారావు, షేక్ సైదా, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గన్నారు.

**వీరులపాడు మండలంలో..**

వీరులపాడు: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని తద్వారా అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని స్వస్థ నారి.. సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వీరులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం ఆరోగ్యజాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కన్నమాల సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు మండూరి ప్రకాశరావు, వైద్యాధికారి రవికిరణ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి



నందిగామలో విశ్వకర్మకు పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నాయకులు



మక్కపేటలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



లింగగూడెంలో విశ్వకర్మకు పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

నందిగామటౌన్: కళలు, నైపుణ్యానికి మూలకారకుడైన విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొనటం సంతోషంగా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి పేర్కొన్నారు. పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ విశ్వకర్మ ఆశీస్సులతో వృత్తి రంగాల నిర్వాహకులకు విజయం చేకూరాలని ఆకాంక్షించారు.

**వత్సవాయి మండలంలో..**

మక్కపేట(వత్సవాయి):విశ్వకర్మ జయంతిని బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు సంఘమండల అధ్యక్షులు కొమరగిరి శ్రీనివాసరావు, నాయకులు వెంకటేశ్వర్లు, అప్పలాచారి, బ్రహ్మం, వీరబ్రహ్మాచారి, రవి, చిప్పాడ శ్రీను, నరసింహాచారి, బ్రహ్మాచారి, వెంకటరత్నం, పరిపూర్ణచారి పాల్గొన్నారు.

**పెనుగంచిప్రోలు మండలంలో..**

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలుతోపాటు పలు గ్రామాల్లో బుధవారం శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తునికిపాటి శివను ఘనంగా సత్కరించారు. విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు నంచర్ల గోపాలరావు, వెలిశాల ఏడుకొండలు, తునికిపాటి రాంబాబు, పులికొండ పిచ్చయ్యాచారి, నంచర్ల గోపి, పుల్లయ్యాచారి, రామాచారి, కల్లూరి శ్రీనివాసరావు, తునికిపాటి వైకుంతాచారి, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

**నందిగామ మండలంలో..**

నందిగామరూరల్: దైవిక వాస్తు శిల్పి విరాట్ విశ్వకర్మను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని చందాపురం జెడ్పీ పాఠశాల హెచ్ఎం రాజశేఖర్ సూచించారు. పాఠశాలలో బుధవారం విశ్వకర్మ జయంతిని ఘనంగా సత్కరించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిద్ధార్థలో రేపు ఇంటర్నల్ హ్యాకథాన్–2025



పోస్టర్‌ను ఆవిష్కరించిన కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో ఉన్న ప్రతిభకు మరింతగా పదును పెట్టడానికి శుక్రవారం తమ కళాశాలలో ఇంటర్నల్ హ్యాకథాన్–2025ను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. హ్యాకథాన్–2025కు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2025లో భాగంగా తమ కళాశాలలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కళాశాల డేటా సైన్స్ విభాగాధిపతి ఉదయశ్రీ మాట్లాడుతూ ఆరుగురు విద్యార్థులు కలిసి ఒక టీమ్‌గా ఏర్పడి ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అలాంటి 30 టీమ్‌లు హ్యాకథాన్‌లో పాల్గొంటాయని తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన టీమ్ రాష్ట్ర స్థాయిలో జరిగే హ్యాకథాన్‌లో పాల్గొంటాయన్నారు.

## కనులపండువగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘాల నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఈశ్వరీదేవి మందిరంలో విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలయం వద్ద విశ్వకర్మ హోమం, విశ్వకర్మ–గాయత్రీదేవి అమ్మవార్ల కల్యాణం చేశారు. అనంతరం విశ్వబ్రాహ్మణ సంఘం, స్వర్ణకార సంఘాల ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహించారు.